పార్కుల్లో సందడే సందడి



జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద సందర్శకులు



కంబాలకొండ కొలనులో బోటు షికారు చేస్తున్న సందర్శకులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): పార్కుల్లో కార్తీక మాసం సందడి ప్రారంభమైంది. నాగుల చవితి సందర్భంగా నాగన్న పూజల కోసం వచ్చినవారు పార్కుల్లో వనభోజనాలు చేశారు. ఇందిరాగాంధీ జూ పార్కు, కంబాలకొండ, ముడసర్లోవ పార్కు, కైలాసగిరి సందర్శకులతో శుక్రవారం కళకళలాడాయి. నాగులు చవితి పూజలు ఉదయం 8.30 లోపు, మళ్లీ 10 గంటల నుంచి 11.30 వరకు మాత్రమే చేయాల్సి ఉండటంతో నగర వాసులు పలు చోట్ల నుంచి ఆయా పార్కుల్లో పుట్టల వద్దకు చేరుకున్నారు. వీరి కోసం అధికారులు పార్కులను ఉదయం 7.30 గంటలకే తెరిచారు. పార్కుల్లో ప్రవేశించిన వారు నాగన్న పూజలు చేసిన అనంతరం ఎక్కువమంది అక్కడే చెట్ల కింద వనభోజనాలు చేశారు.

కంబాలకొండలో సందర్శకులు కొలనులో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. పిల్లలు ఆట పరికరాలు వద్ద ఆడుకొంటూ సందడి చేశారు. ఇందిరాగాంధీ జూ పార్కులో నాగన్న పూజల అనంతరం అక్కడ వన్యప్రాణులను తిలకిస్తూ సరదాగా గడిపారు. వివిధ రకాల పక్షులు, జంతువుల ఎన్‌క్లోజర్లు, పాముల జోన్ వద్ద సందర్శకులు సందడి చేశారు. కోతులు, ఈము పక్షులు, ఆస్ట్రిచ్, నెమళ్లు, సింహాలు, పులులు, చింపాంజీలు, ఎలుగుబంట్లు, నీటి ఏనుగులు, ఏనుగులు, అడవి కుక్కలు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరించాయి. ముడసర్లోవ పార్కులో నాగన్న పూజలకు వచ్చిన పిల్లలు ఆట పరికరాల వద్ద సందడి చేశారు.

జూ ఆదాయం రూ.8.14 లక్షలు

నాగుల చవితి సందర్భంగా పర్యాటక ప్రాంతాలను అధిక సంఖ్యలో భక్తులు సందర్శించారు. ఇందిరా గాంధీ జూ పార్కును శుక్రవారం 9,150 మంది సందర్శించారు. వారి ద్వారా రూ.8,14,753 ఆదాయం లభించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. ముడసర్లోవ పార్కును సుమారు 5 వేల మంది సందర్శించారు. కంబాలకొండ పార్కును 3,500 మందికి పైగా సందర్శించారు. వారి ద్వారా సుమారు రూ.2 లక్షల ఆదాయం లభించినట్లు సిబ్బంది తెలిపారు.

జూలో సెల్‌ఫోన్ టిక్కెట్‌పై అసంతృప్తి

ఇందిరాగాంధీ జూ పార్కు అధికారుల చర్యలపై సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జూలో ప్రవేశించేవారు జేబులో ఉండే సెల్ ఫోన్‌కు కూడా రుసుం చెల్లించాలని కొత్త పద్ధతి పెట్టారు. ఇప్పటికే కారు ప్రవేశానికి రూ.750 చెల్లించాలి. దాంతో పాటు ఆ కారులో ఉన్న వారంతా టిక్కెట్ తీసుకోవాలి. పెద్దలు రూ.70, పిల్లలు రూ.30 చెల్లించాలి. ఇపుడు సెల్ ఫోన్‌కు కూడా టిక్కెట్ పెట్టారు. దీంతో సందర్శకులు మండిపడుతున్నారు. ఈ చర్యలతో జూకి సందర్శకుల సంఖ్య తగ్గి, ఆదాయానికి గండిపడే అవకాశం ఉందని వన్యప్రాణి ప్రేమికులు భావిస్తున్నారు.

వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలి



కలెక్టర్ మల్లికార్జునను సన్మానిస్తున్న డాక్టర్ సాయిసునీల్‌కిషోర్ తదితరులు

మహారాణిపేట : నెలలు నిండాకుండా పుట్టే పిల్లలకు వైద్యం అందించేందుకు ఆస్పత్రులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. శుక్రవారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా మెడికవర్ యాజ మాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. నెలలు నిండకుండా పుట్టే పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వాటిని ఎదుర్కోవడానికి అన్ని వైద్య పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సెంటర్ హెడ్ శ్యామలారెడ్డి, వైద్యులు సాయి సునీల్ కిషోర్, విద్యా రమ, రాధిక, మౌనిక, జి.రమ, అనిత త్రిపాఠి, మాధూరి, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'అన్‌వైలింగ్ బాండ్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితరులు

ఎంవీపీకాలనీ: 'అన్‌వైలింగ్ బాండ్స్'ఆంగ్ల నవలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ శుక్రవారం ఆవిష్కరించి, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నవలా రచయిత్రి డాక్టర్ స్నేహవసుంధరలకు అందించారు. ఏయూలోని హిందీ విభాగ సమావేశ మందిరంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీవిత గమనంలో మానవ సంబంధాలను ఈ పుస్తకం చాలా గొప్పగా వివరించిందన్నారు. ప్రేమ, స్నేహభావంతో పాటు సంక్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొనాలో తెలియజెప్పిన విధానం బాగుందన్నారు. రచయిత్రి స్నేహ వసుంధర డాక్టర్ వృత్తితో పాటు రచనల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. రచయిత్రి మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న మానవ సంబంధాల తీరుతెన్నులనే నవలా రూపంలో ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ నవలలోని సరస్వతి, రిషి పాత్రలు సమకాలీన సమాజంలో ఎదురయ్యే మానవ సంబంధాలు, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే తీరును ప్రతిబింబిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆచార్య బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాధ

విశాఖ విద్య : జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన బి.రాధ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, డీవీఈవోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలియజేశారు. వృత్తి విద్య కళాశాలల అభివృద్ధికి చిత్త శుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచించారు.

అయ్యప్పలకు వంశీకృష్ణ అన్నప్రసాద వితరణ



అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ దంపతులు

మద్దిలపాలెం: అయ్యప్ప భక్తులకు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ దంపతులు అన్న ప్రసాదం వితరణ చేశారు. కొత్త వెంకోజీపాలెం శ్రీ జ్ఞాన లింగేశ్వర ఆలయంలో అయ్యప్ప భక్తుల నిత్యాన్నదాన కార్యక్రమంలో శుక్రవారం వంశీకృష్ణ దంపతులు పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా వడ్డించారు. అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వంశీకృష్ణ దంపతుల పేరిట ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెలి సూర్యప్రకాష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రిసోర్సెస్ వినియోగంపై అవగాహన



డాక్టర్ ప్రదీప్‌ని సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 'స్ట్రీమింగ్ రీసెర్చ్ యూజింగ్ ఐఈఈఈ వేల్యూ, ఐఈఈఈ రిసోర్సెస్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్' అంశంపై ఐఈఈఈ కన్సల్టెంట్ డాక్టర్ పి.ప్రదీప్ అవగాహన కల్పించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఐఈఈఈ రిసోర్సెస్ ఎంతగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ ప్రదీప్‌ని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల స్పందనకు 46 వినతులు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

మహారాణిపేట : కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు 46 వినతులు వచ్చాయి. జిల్లా, మండల కార్యాలయాల్లో విధుల నిర్వహించే ఉద్యోగులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులను అందజేశారు. డీఆర్వో కె. మోహన్‌కుమార్, ఏవో ఈశ్వరరావు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నిర్ణీత కాలంలో వీటికి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలియజేశారు. ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా టపాసులు, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లు, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావొద్దన్నారు. ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశముందని ఆయన చెప్పారు. వీటి వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేలుడు పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటివి గుర్తించిన వారు వెంటనే రైల్వే అధికారులకు, రైళ్లలో ఉండే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని డీఆర్ఎం సూచించారు.



పుట్ట వద్ద బాణసంచాతో భక్తుల సందడి

ఆరిలోవ: నాగేంద్రా.. మేము, మా వంశం నిన్ను ఆరాధిస్తున్నాం. పొరపాటున నిను తొక్కితే తొలగిపో. నడుంపై కాలు పడితే నీ వాడేననుకో. పడగపై కాలేస్తే కస్సుబుస్సుమని మమ్మల్ని భయపెట్టకు తండ్రీ.. అంటూ ఊరూవాడా పుట్టల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. పట్టణ, మండలంలో ప్రజలు నాగుల చవితి పండగను ఘనంగా నిర్వహించారు. కుటుంబసమేతంగా పుట్టల వద్దకు చేరుకుని పుట్టలో పాలు, గుడ్లు వేసి, చిమిలి, పళ్లు, కొబ్బరికాయలు, తేగలు నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాల్చి స్వామిని ఆహ్వానించారు.

మద్దిలపాలెం: నాగుల చవితి పండగను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు తరలి వెళ్లారు. దీంతో కాలనీ వద్ద సందడి నెలకుంది. మద్దిలపాలెం, పిఠాపురంకాలనీ, శివాజీపాలెం, నేతాజీనగర్ ప్రాంతీయలు, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోకి తరలి వెళ్లారు. అక్కడ పుట్టల్లో పాలు, గుడ్లు వేసి పూజలు జరిపారు.

పాహి పాహి సర్పరూప

పాహి పాహి సర్పరూప నాగదేవ దయామయ.. సత్సంతాన సంపత్తిం దేహిమే శంకర ప్రియ అనంతాది మహానాగ రూపాయ వరదాయచ తుభ్యం నమామి భుజగేంద్ర సౌభాగ్యం దేహిమే సదా! అని కీర్తిస్తూ శుక్రవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు నాగేంద్రుడిని భక్తిప్రపత్తులతో కొలిచారు.



పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఏయూక్యాంపస్: నాగుల చవితి పర్వదినాన్ని నగర ప్రజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. శుక్రవారం ఉదయం పెద్ద సంఖ్యలో ప్రజలు ఏయూలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న పాముల పుట్టల వద్దకు చేరుకుని పూజలు జరిపారు. చిన్నారులు బాణసంచా కాల్చి సందడి చేశారు. పండగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరిపారు. నాగుల చవితికి వచ్చిన భక్తులతో విశ్వవిద్యాలయం సందడిగా మారింది.

ఎంవీపీకాలనీ: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. కాలనీలో కొలువుదీరిన పలు ఉద్యానవనాలు, ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పుట్టల్లో పాలు పోసి, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుడ్లు, చిమిలి నైవేద్యం పెట్టారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-7లోని వీఎంఆర్‌డీఏ నర్సరీకి భక్తులు ఎక్కువగా వెళ్లారు. 19వ వార్డులో నాగదేవత సహిత ఎల్లమ్మతల్లి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు.

ఈశ్వరరావుకు ఏయూ డాక్టరేట్



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఈశ్వరరావు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి ఎస్.ఈశ్వరరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో ×ఎవల్యూషన్ ఆఫ్ లిక్విఫేక్షన్ సస్సెబిలిటీ ఆఫ్ ద స్ట్రాట్ ఆఫ్ విశాఖపట్నం రీజియన్.. బేస్డ్ ఆన్ ఎస్‌పీటీ ఎన్ వేల్యూస్ అండ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ మోడల్‌€ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి శుక్రవారం డాక్టరేట్ ఉత్తర్వులను ఈశ్వరరావు స్వీకరించారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయన్ని అభినందించారు. ఈశ్వరరావు తన పరిశోధనలో తీర ప్రాంతాలలో భూకంపాలు సంభవించే సమయంలో నేల కృంగి, భవనాలకు ఎదురయ్యే ఇబ్బందులు, నివారణపై అధ్యయనం చేశారు.

భగీరథ విలాసం నృత్య రూపకం నేడు

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో భగీరథ విలాసం నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారు. సంస్థ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రముఖ పాత్రికేయుడు అయ్యల సోమయాజుల జోగారావు రచన, ద్వారం త్యాగరాజు సంగీతంలో కూచిపూడి నాట్యకారిణి కె.వి.లక్ష్మీ నృత్య పరికల్పనలో ప్రదర్శన జరగనుందన్నారు. సుమారు గంటన్నర పాటు సాగే భగీరథ నాట్య విలాసం సాయంత్రం 6.15 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి సూదగాని గీతానారాయణ్ హాజరై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

ఘనంగా నవజాత శిశు దినోత్సవం



ప్రీ మెచ్యూరిటీ పిల్లలతో తల్లిదండ్రులు, వైద్యులు

ఆరిలోవ: స్థానిక హెల్త్ సిటీ రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ నవజాత శిశు(వరల్డ్ ప్రీ మెచ్యూరిటీ) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, గతంలో పుట్టి, ఆరోగ్యంగా ఉన్న పిల్లలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో భాగంగా గైనకాలజిస్టులు డాక్టర్ రాగసుధ, డాక్టర్ నిహారిక, డాక్టర్ శైలజ, డాక్టర్ విశాల్ మాట్లాడుతూ నెలలు నిండని పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గర్భిణిగా ఉన్న సమయంలో గర్భ సంచి సమస్య, గర్భ సంచిలో ఇన్‌ఫెక్షన్, బీపీ, మధుమేహంతో బాధపడుతున్నవారికి నెలలు నిండని పిల్లలు పుట్టే అవకాశం ఉందన్నారు. గర్భం దాల్చిన సమయంలో ఆయా సమస్యలున్నవారు వెంటనే గైనికాలజిస్టులను సంప్రదించాలన్నారు. గర్భం దాల్చిన నుంచి బెడ్ రెస్ట్ తీసుకోవాల్సిన అవసరంలేదని, జాగ్రత్తలు పాటిస్తే చాలన్నారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులు రెయిన్‌బో ఆస్పత్రిలో ప్రీ మెచ్యూరిటీ పిల్లల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

నేడు ఏయూలో జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ దొరబాబు తెలిపారు. హెటిరో సంస్థ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో 25 ఖాళీల భర్తీకి ఫార్మసీ కోర్సులు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులు. జూనియర్ కెమిస్ట్‌లో 50 ఖాళీలు భర్తీ చేయనున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు అర్హులు. జూనియర్ టెక్నిషియన్ ఉద్యోగాలకు ఐటీఐ ఫిట్టర్, మెకానికల్ డిప్లమో చేసిన వారు అర్హులు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్ట్ ఫార్మసీ ఎయిడ్, సీఎస్‌ఏ, ఆడిట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



మద్దిలపాలెం యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం ఇసుకతోట, మద్దిలపాలెం ప్రాంతాల్లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందితో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. 12 వారాలలోపు గర్భిణుల పేర్లు నమోదు చేయాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ సలహాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గర్భిణికి రక్త హీనత టెస్ట్ చేయాలని, అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో ఉన్న గర్భిణుల నమోదు 100 శాతం అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది సందర్శనకి వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసి వెళ్లాలని ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం వితరణ

బీచ్‌రోడ్డు: సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా శర్వాణి ఎన్జీవో సంస్థకు ఏడాదికి సరిపడే బియ్యాన్ని అందించినట్లు సీఎల్ఆర్క్ ఇండస్ట్రీస్ చైర్మన్ అగర్వాల్ తెలిపారు. శర్వాణి సంస్థలో 120 మంది విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న 15వ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు



ఎంపీ ఎంవీవీని కలిసి మద్దతు తెలుపుతున్న అనూష పట్నాయక్

మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలో శనివారం ప్రారంభంకానున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు 15వ వార్డులోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు సూచించారు. ఈ మేరకు శుక్రవారం వార్డు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. వార్డు నుంచి పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పార్టీ శ్రేణుల్ని సమాయత్తం చేయాలని కోరారు.

బస్సు యాత్రకు శిష్టకరణాల మద్దతు

బీచ్‌రోడ్డు: తూర్పు నియోజకవర్గంలో శనివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో శిష్టకరణ సామాజిక వర్గం భాగస్వామ్యం కానున్నట్లు రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కలిశారు. బస్సు యాత్ర విజయవంతానికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఆమె వెంట ఆలిండియా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు కేఎల్‌వీఎస్ బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌కే మహంతి ఉన్నారు.

డిసెంబర్ 18న వారణాసిలో విశ్వశాంతి మహాయజ్ఞం



విశ్వశాంతి మహాయజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విహంగం యోగ సందేశ్ ప్రతినిధులు

మద్దిలపాలెం(విశాఖతూర్పు): ప్రపంచ శాంతికి డిసెంబర్ 18న వారణాసిలో 25 వేల హోమగుండాలతో విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు విహంగం యోగ సందేశ్ ప్రతినిధులు సమిత్‌కుమార్, ఓజా, సుశీల్, యోగీష్‌లు తెలిపారు. శుక్రవారం పిఠాపురం కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. విహంగం యోగ సంస్థ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు సఫల్‌దేవ్ మహరాజ్ ఆశీస్సులతో విజ్ఞాన్‌దేవ్ మహరాజ్, స్వతంత్రదేవ్ మహరాజ్‌ల నేతృత్వంలో వేలాది మంది రుత్విక్కులతో అత్యంత నిష్ఠగా మహాయజ్ఞం నిర్వహిస్తామన్నారు. ఈ యజ్ఞానికి ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అంగీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న గురుద్వారా స్మార్ట్ ఇన్ హోటల్‌లో విజ్ఞాన్‌దేవ్ మహరాజ్, స్వతంత్రదేవ్ మహరాజ్‌లు విహంగం యోగాపై సత్సంగం, మెడిటేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వచ్చే నెల 17న వైజాగ్ మారథాన్



టీషర్ట్, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్, నిర్వాహకులు

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో డిసెంబర్ 17న వైజాగ్ మారథాన్ జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ పరుగు నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నారు. 21 కిలోమీటర్ల పరుగుతో పాటు 10 కి.మీ., 5 కి.మీ., 3 కి.మీ. పరుగు పార్క్ హోటల్ దరి వైఎస్సార్ విగ్రహం చెంత ప్రారంభించి అక్వేరియం, రోప్ వే మీదుగా రాడిసన్ హోటల్ వద్ద టర్న్ తీసుకుని తిరిగి వీఎంఆర్డీఏ పార్క్ వద్దకు చేరుకోవడంతో ముగియనుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలన్నారు. వైజాగ్ మారథాన్ నిర్వాహకులు ఔత్సాహికులకు అందించే టీషర్ట్, మెడల్స్‌ను ప్రదర్శించారు. అల్పాహారాన్ని ఔత్సాహికులకు అందిస్తామని, దారి వెంట వైద్య సహాయకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైజాగ్‌మారథాన్.కామ్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

స్వరూపానందేంద్రునికి జన్మదిన శుభాకాంక్షలు



శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ జన్మదినం సందర్భంగా పెందుర్తి, చినముషిడివాడలోని పీఠంలో స్వామివారిని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి దర్శించుకున్నారు. స్వామి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు పొందారు. - ఆరిలోవ